# దైవమే నిజమైన గురువు

ఏ ప్రేమశక్తిచే ఈ ధారుణీ చక్ర
మిరుసు లేకుండగా తిరుగుచుండు
ఏ ప్రేమశక్తిచే నెల్ల నక్షత్రాలు
నేలరాలక మింట నిలిచియుండు
ఏ ప్రేమశక్తిచే నీ పుడమిపై బడక
కడలిరాయడు కాళ్ళు ముడుచుకొనియె
ఏ ప్రేమశక్తిచే ఈరేడు లోకాలు
గాలిదేవుడు సురిటీలు విసరె
ఆ ప్రేమశక్తియె ఆత్మశక్తి
అద్భుత మనంత మద్వితీయమగు శక్తి
నిండియున్నది బ్రహ్మాండ భాండమెల్ల
ఈ మహాసృష్టి యంతయు ప్రేమమయమె!

ప్రేమ అన్నను, సత్యమన్నను, అహం అన్నను అన్నీ భగవంతునియొక్క దివ్యనామములే! భగవంతుడు తనగురించి తాను "అహం బ్రహ్మాస్మి", "నేను బ్రహ్మను" అని చెప్పుకుంటాడు. అంతేగాని, మరొక పేరు చెప్పడు.

సత్యంబునందుండి సర్వంబు సృష్టించె
సత్యంబు నందణగె సర్వసృష్టి
సత్యమహిమ లేని స్థలమేది కనుగొన్న?
శుద్ధసత్వమిదియె చూడరయ్య

కనుక, ప్రపంచంలో జరిగేటటువంటి సమస్త కర్మలకూ, సమస్త విషయములకూ

srisathyasaivachanamrutam

భగవంతుడే కారణం.

గురుపూర్ణిమ అనగా ఏమిటి? ఎవరో ఒక సన్యాసికో, ఒక మహనీయునికో కొంచెం దక్షిణ సమర్పించి, వారినుండి మంత్రదీక్షను స్వీకరించే రోజుగా దీనిని భావిస్తున్నారు. కాని, అది కాదు గురుపూర్ణిమ పరమార్థం. అసలు గురువనగా ఎవరు? ఒకరు మనకు మంత్రోపదేశము చేశారనీ, ఒకరు పవిత్రమైన విషయములను బోధించారనీ వారినే మనం గురువుగా భావించి, గురుపూజ చేస్తున్నాము. కాని, ఇది సరియైన గురుతత్త్వము కాదు.

**గురుర్బ్రహ్మ గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః**
**గురుస్సాక్షాత్పరంబ్రహ్మ తస్మై శ్రీ గురవే నమః**

కనుక, బ్రహ్మ, విష్ణు, మహేశ్వర స్వరూపుడైన దైవమే నిజమైన గురువు. పూర్ణిమ అనగా ఏమిటి? మీ మనస్సు ఎట్టి దోషములూ లేకుండా నిర్మలమై, నిశ్చలమై, నిస్వార్థమై ఉన్నటువంటి దినమే పూర్ణిమ. పవిత్రమైన హృదయంతో ఏది చెప్పిననూ అదే నిజమైన దైవవాక్కు. మన హృదయమునుంచి ఆవిర్భవించినటు వంటి వాక్యమే సత్యమైనటువంటి గురు వాక్యము.

**ఏకలవ్యుని గురు భక్తి**

ఒకనాడు ద్రోణాచార్యుడు, అతని భార్య, కొడుకు అశ్వత్థామ ముగ్గురూ కలసి ప్రయాణమై వెళుతుంటే ఒకచోట కొందరు పిల్లలు ఏదో గట్టిగా అరుస్తూ ఒక బావి చుట్టూ తిరుగుతూ ఉండటం కనిపించింది. ఆ పిల్లలెవరు? ధృతరాష్ట్రుని పుత్రులు, పాండురాజు పుత్రులు. అప్పుడు ద్రోణాచార్యుడు వారివద్దకు వెళ్ళి "నాయనలారా! దేనికోసం మీరు వెతుకుతున్నారు?" అని అడిగాడు. "మేము ఆడుకుంటూ ఉంటే మా బంతి ఈ బావిలో పడిపోయింది" అని చెప్పారు, ఆ పిల్లలు. అప్పుడు ద్రోణుడు, "దీనిని తీయడానికి ఇంత కష్టపడుతున్నారా మీరు? నేను తీస్తాను" అని చెప్పి ఒక అంబు తీసి కొట్టాడు. అది నేరుగా పోయి బంతికి గుచ్చుకుంది. ఆ బాణానికి గుచ్చుకునేటట్లు ఇంకొక బాణం తీసి కొట్టాడు. ఆవిధంగా వరుసగా ఐదారు బాణాలను తీసి కొట్టేటప్పటికి ఆ బంతిని బావిలోనుండి పైకి లాగడానికి వీలయింది. ఈ చిత్రమును చూసిన పిల్లలందరూ ఆయనకు

sri sathyasai vachanamrutam

పాదాక్రాంతులైపోయారు. “ఇంతటి విలువిద్య తెలిసినటువంటి మహావీరుడు ఇంతకాలానికి మాకు కనిపించాడు కదా” అని వాళ్ళు ఆనందించారు. ఈవిషయాన్ని తెలుసుకొని భీష్ముడు ద్రోణాచార్యుణ్ని కౌరవ, పాండవులకు గురువుగా నియమించాడు.

ఒకపర్యాయం ఏకలవ్యుడు ద్రోణునివద్దకు వచ్చి తననుకూడా శిష్యునిగా స్వీకరించి తనకు విలువిద్య నేర్పవలసిందిగా ప్రార్థించాడు. కాని, ద్రోణుడు అంగీకరించలేదు. “నేను ధీరులు, వీరులు అయిన రాజకుమారులకు మాత్రమే బోధిస్తానుగాని జంతువులను వేటాడే నీవంటి అడవిజాతివానికి బోధించను” అని అన్నాడు. అయినప్పటికీ ఏకలవ్యుడు ద్రోణునికి నమస్కరించి, “ఈయనే నా గురువు” అని తన మనస్సులో పెట్టుకున్నాడు. గురువు తనకు ఎట్టి సూచనలూ ఇవ్వకపోయినప్పటికీ తాను ఇంటికి వెళ్ళిన తరువాత మట్టితో గురువుయొక్క బొమ్మను చేసి పూజిస్తూ, గురువును స్మరిస్తూ విలువిద్యను నేర్చుకున్నాడు. అతనియొక్క గదిలో తన గురువుయొక్క బొమ్మ తప్ప మరొక వస్తువు ఉండేది కాదు. ఆవిధంగా తన గురువుపై ఏకాగ్రతతో మనస్సుపెట్టి సాధన చేయడంవల్ల అతను విలువిద్యలో గొప్ప ప్రావీణ్యత గడించాడు.

ఒకనాడు ద్రోణాచార్యుడు వేట నిమిత్తం శిష్యులను వెంటపెట్టుకొని అరణ్యానికి వెళ్ళాడు. అందరూ ఒకచోట కూర్చున్న సమయంలో ఒక వేటకుక్క మొరగటం మొదలుపెట్టింది. ఇంతలో ఎక్కడినుండో ఒక బాణం వచ్చి ఆ కుక్క నోట్లో గుచ్చుకుంది. వెనువెంటనే ఆ బాణానికి ఇంకొక బాణం వచ్చి గుచ్చుకుంది. శబ్దభేది విద్యలో అంత ప్రావీణ్యతగల విలుకాడు ఎవరా అని అర్జునునికి ఆశ్చర్యం కలిగి అతనికోసం చూస్తుంటే ఏకలవ్యుడు కనిపించాడు. “ఎవరు నీ గురువు?” అని అడిగాడు, అర్జునుడు. ఏకలవ్యుడు ద్రోణాచార్యుని చూసి నమస్కరించి, “ఈయనే నా గురువు” అన్నాడు.

అర్జునుడు ద్రోణాచార్యుణ్ని కోపంగా చూసి, “నాకొక్కనికి తప్ప శబ్దభేదిని ఎవ్వరికీ బోధించనని మీరు మాట ఇచ్చారు. మీ మాటను నమ్మి నేనింతవరకు ధైర్యంగా ఉన్నాను” అని అన్నాడు. అప్పుడు ద్రోణుడు, “నాయనా! నేను ఇతనికి గురువును కాను, ఈ విద్యను నేను బోధించలేదు” అని చెప్పగా ఏకలవ్యుడు, “వారు చెప్పింది నిజమే. కాని, నేను వారి

sri sathyasai vachanamrutam

రూపాన్ని మనస్సులో చిత్రించుకొని, వారిపట్ల గురుభావముతో దీనిని నేర్చుకున్నాను" అని అన్నాడు. తనకంటే గొప్పవాడు, మహాశక్తిమంతుడైన విలుకాడు ఒకడున్నాడు కదా అన్న అసూయతో అర్జునుడు, "మీరేమైనా గురుదక్షిణ అడగండి" అని ద్రోణునికి చెప్పాడు. అర్జునుణ్ని తృప్తిపరచాలనే ఉద్దేశ్యంతో ద్రోణాచార్యుడు, "నాకు గురుదక్షిణ ఏమిస్తావు?" అని ఏకలవ్యుణ్ని అడిగాడు. అప్పుడు తిరిగి అర్జునుడే ద్రోణునితో, "మిమ్మల్ని గురువుగా భావించి ఈ విలువిద్యను నేర్చుకున్నానని చెప్పాడు. కాబట్టి, అతని విలువిద్య భంగం కావడానికి కూడా మీరే కారకులు కావాలి" అని అన్నాడు. అప్పుడు ద్రోణుడు అతని కుడిచేతి బొటనవ్రేలిని ఇమ్మని అడిగాడు. ఏకలవ్యుడు తక్షణమే తన కుడిచేతి బొటనవ్రేలిని ఖండించి గురుదక్షిణగా సమర్పించాడు. తన విలువిద్య భంగమైనందుకు ఏకలవ్యుడు ఏమాత్రం బాధపడలేదు; "నా గురువు కోర్కెను నెరవేర్చాను కదా" అని చాలా ఆనందించాడు. ఆనాటినుండి ఏకలవ్యుడు బాణం పట్టలేదు. అర్జునునికి చాలా ఆనందమైంది. అర్జునుడు తప్ప శబ్దభేది తెలిసినటువంటివారు ఈ జగత్తులో మరొకరు లేరని అతనిలో అహంకారం కూడను పెరిగిపోయింది.

**దక్షిణాంగుష్ఠమిచ్చినదానజేసి**
**బాణసంధాన లాఘవ భంగమయిన**
**నెఱుకు విలువిద్య కలిమికి హీనుడయ్యె**
**బార్థునకు మనోరుజయును బాసెనంత**

ఈనాడు అనేకమంది ఆత్మతత్త్వాన్నిగురించి తెలుసుకోవాలని ప్రయత్నం చేస్తున్నారు. "నేను, నాది" అనేటటువంటి అహంకార, మమకారములను త్యజించినప్పుడే ఆత్మతత్త్వము చక్కగా అనుభవానికి వస్తుంది. ఈ రెండూ మీయందుంచుకొని మీరు ఎంత ప్రయత్నం చేసినప్పటికీ ఆత్మతత్త్వం గోచరించదు. మొట్టమొదట 'నేను' (I) అనే అహంకారాన్ని త్యజించాలి. అప్పుడే మీయొక్క జ్ఞాననేత్రం తెరచు కుంటుంది. అహంకారాన్ని త్యజించినందువల్లనే జీసస్ పూజనీయుడయినాడు. మీకు తెలుసు – క్రిష్టియన్స్ సిలువ (†) ను పూజిస్తారు. 'I' (నేను) అనేదాని మెడ కొట్టేసినప్పుడు అది సిలువ అవుతుంది. అహంకారాన్ని త్యజించడమే దీని అంతరార్థం. అహంకారమనేది అన్ని విధములైన దుః

sri sathyasai vachanamrutam

ఖమునకూ, అశాంతికీ, బాధలకూ మూలకారణం అని మీరు గుర్తించాలి. 'ఇది నాది, అది నాది' అనే మమకారాన్నికూడా త్యజించాలి. "వీళ్లందరూ నా శిష్యులు" అని చెప్పుకోవడంవల్ల అక్కడకూడను అహంకారం వచ్చేస్తుంది.

**భగవంతుని శ్వాసముయొక్క స్వరూపమే భగవద్గీత**

నిజమైనటువంటి బోధ మన హృదయమునుండియే ఆవిర్భవిస్తుంది. దీనిని ఆధారం చేసికొనియే శివరాజ్ పాటిల్ భగవద్గీతపై ఇంత చక్కని వ్యాఖ్యానం వ్రాయగలిగాడు. ఎన్ని గ్రంథాలు చదివినప్పటికీ అతని సందేహాలన్నీ తీరలేదు. ఒకరు రాసినదాన్నిబట్టి అతను రాయలేదు. ఒకరు బోధించినది తాను వినడంగాని, ఎవరినో అడగటంగాని ఏమీ చేయలేదు. తనయొక్క స్వవిద్యయే తనను ఈ కార్యంలో ఉత్తీర్ణుణ్ని చేసింది. తన హృదయానికి తోచినటువంటి దానిని, తాను హృదయపూర్వకంగా నమ్మినటువంటిదానిని చక్కగా లిఖించాడు. మధ్యమధ్య నాదగ్గరకు వచ్చినప్పుడు 'ఇది సరిగా ఉందా లేదా?' అని చూపేటటువంటివాడు. సామాన్యంగా అనేకమంది గ్రంథాలు రాస్తుంటారు. కాని, శివరాజ్ పాటిల్ రాసినటువంటి ఈ భగవద్గీత గ్రంథమునకు చాలా విశిష్టత ఉన్నది. అతను కొన్ని నెలలపాటు ఎంతగానో యోచించి, భగవద్గీతలో ఉన్నటువంటి విషయాన్ని తన హృదయంలో చక్కగా ఇముడ్చుకొని, దానినే ఈ గ్రంథములో చిత్రించాడు. తద్వారా అతనికీ తృప్తి కలిగింది; పుస్తకానికీ గౌరవం లభించింది. భగవద్గీతయొక్క సారమంతయు ఇందులో ఇమిడియున్నది. భగవద్గీత చాలా పవిత్రమైన గ్రంథం. ఇది భగవంతుని శ్వాసముయొక్క స్వరూపమే.

శివరాజ్ పాటిల్ ఈనాటి భక్తుడు కాదు; ముప్పై సంవత్సరాలనుంచి స్వామి దగ్గరకు వస్తున్నాడు. మొదలు ఎస్.బి. చవాన్ ఇంట్లో స్వామిని దర్శించాడు. ఆ తరువాత చవాన్, ఇతను ఇద్దరూ జతగా వచ్చేటటువంటివారు. ప్రశాంతి నిలయానికి మాత్రమే కాదు, స్వామి ఎక్కడ ఉంటే అక్కడికి వచ్చేవారు. మొదట ఇతను బొంబాయిలో, ఆ తరువాత ఢిల్లీలో మినిష్టర్‌గా ఉన్నాడు. లోక్‌సభ స్పీకర్‌గా కూడా పని చేశాడు. ఈవిధంగా జీవితంలో పైకి వచ్చాడు. గవర్నమెంటుకు మంచిపేరు తెచ్చాడు. అందువల్లనే, గవర్నమెంటుకు శివరాజ్

srisathyasaivachanamrutam

పాటిల్ అంటే చాలా నమ్మకం కలిగింది. అతను దేనినీ ఆశించలేదు. ఇది నీకు కావాలా? అని అడిగినప్పటికీ తనకు కావాలని అడిగేటటువంటివాడు కాదు. అన్నింటికీ దైవంపైనే భారం వేశాడు. ఏది చేసినా 'ఇది భగవంతునియొక్క పని' అని భావించి చేస్తూ వచ్చాడు. అందువల్లనే, ఈ భగవద్గీత ఇంత సుందరంగా, సరియైన పదములతో చక్కగా రూపొందింది.

**స్థిరమైన నమ్మకం, అర్పితభావం రెండూ ఉండాలి**

ప్రతి వ్యక్తీ మొట్టమొదట దైవంపట్ల నమ్మకమును, 'సెల్ఫ్ కాన్ఫిడెన్స్' (ఆత్మవిశ్వాసము)ను పెంచుకోవాలి. 'సెల్ఫ్ కాన్ఫిడెన్స్' అనేది ఉంటే 'సెల్ఫ్ సేటిస్‌ఫేక్షన్' (ఆత్మతృప్తి) కలుగుతుంది. 'సెల్ఫ్ సేటిస్‌ఫేక్షన్' కలిగితే 'సెల్ఫ్ సేక్రిఫైజ్' (స్వార్థత్యాగం) చేయడానికి వీలవుతుంది. 'సెల్ఫ్ సేక్రిఫైజ్' చేసినప్పుడే 'సెల్ఫ్ రియలైజేషన్' (ఆత్మసాక్షాత్కారం) ప్రాప్తిస్తుంది. కాబట్టి, ఆత్మ సాక్షాత్కారమునకు మూడు స్టెప్స్ ఉన్నాయి. మొదటిది 'సెల్ఫ్ కాన్ఫిడెన్సు', రెండవది 'సెల్ఫ్ సేటిస్‌ఫేక్షన్', మూడవది 'సెల్ఫ్ సేక్రిఫైజ్'. ఈ మూడూ చేరినప్పుడే మానవునికి పూర్ణత్వం సిద్ధిస్తుంది. అదే పూర్ణిమ. అనగా ఎట్టి దోషములూ లేనటువంటి స్థితి. కనుకనే, భగవద్గీత ఈ మూడింటినీ ప్రధానంగా బోధిస్తున్నది. లౌకిక విషయాలపట్ల మమకారం పెంచుకోవడం కేవలం గాలిమేడలను నిర్మించుకోవడంవంటిది. అవి వచ్చినవి వచ్చినట్లుగా పోతాయి. కనుక, మనం మొట్టమొదట ఆత్మవిశ్వాసమును పెంచుకోవాలి. కొందరు కొంతకాలం భగవంతుణ్ని పూజిస్తారు. ఆ తరువాత తమ వాంఛలు నెరవేరకపోతే భగవంతుణ్ని ద్వేషిస్తారు. ఇటువంటివారు రాక్షసులేగాని, మానవులు కాదు. మొట్టమొదట భగవంతుణ్ని చూడాలి; తరువాత భగవంతునియందు నమ్మకం కలగాలి; తరువాత పూజించాలి. భగవంతునికి అర్పితం కావాలి. స్థిరమైన నమ్మకం, అర్పితభావం – ఈ రెండూ ఉన్నప్పుడే మానవునికి మనశ్శాంతి కలుగుతుంది. ఇట్టి మానవుణ్ని ప్రపంచంలో అందరూ గౌరవిస్తారు.

మీరు కేవలం గ్రంథములను చదివినంత మాత్రమున, ఉపన్యాసములు ఇచ్చినంతమాత్రమున చాలదు. మీరు ఏది ఆచరణలో పెడతారో అది మాత్రమే

sri sathyasaivachanamrutam

మీదవుతుంది. మీ మనస్సు, మాట, క్రియ మూడూ ఏకం కావాలి. అప్పుడే అది సత్యమవుతుంది. మీ మనస్సు, మాటలు ఒకవిధంగాను, క్రియ మాత్రం మరొకవిధంగాను ఉంటే అది అసత్యమే అవుతుంది. అలాంటివాడు పరిపూర్ణుడు కాజాలడు.

**మంచి పేరు తెచ్చుకోండి! అదే నాకు ఆనందము**

విద్యార్థులారా! మీరు చదివినటువంటి మంచి విషయాలను మీ మనస్సులోనే పెట్టుకుంటే ప్రయోజనం లేదు. వాటిని ఆచరణలో పెట్టాలి. వాటిని మీ టీచర్స్‌కి చెప్పాలి. మీరు మనస్సులో పెట్టుకున్నటువంటిది, తలచినటువంటిది మీ తల్లిదండ్రులకుకూడా చెప్పాలి. వారితో సన్నిహిత సంబంధ బాంధవ్యాన్ని పెంచుకోవాలి. తల్లిదండ్రులను ప్రేమించి, వారి ఆజ్ఞను శిరసావహించినటువంటి వారికి తప్పక అన్నివిధాలుగా విజయం చేకూరుతుంది. భగవద్గీతయొక్క సారమంతా ఈ ఒక్క శ్లోకంలోనే ఉంటున్నది:

**యత్ర యోగేశ్వరః కృష్ణో యత్ర పార్థో ధనుర్ధరః**
**తత్ర శ్రీ ర్విజయో భూతి ర్ధ్రువా నీతి ర్మతి ర్మమ**

ఎక్కడ కృష్ణుడు, అర్జునుడు ఇద్దరూ కలసి ఉంటారో, వారిద్దరి మాట ఒకటిగా ఉంటుందో, అక్కడే విజయం ప్రాప్తిస్తుంది.

ఈనాడు శివరాజ్ పాటిల్ చక్కని ఆనందకరమైన, అమృతమయమైన విషయాన్ని ఈ గీతద్వారా మీకు అందించాడు. ఇలాంటివి మీరు తరచుగా వినటం చాలా అదృష్టం. అనేకమంది పుస్తకాలు రాస్తుంటారు, ఏమేమో రాస్తుంటారు. వాటినన్నింటినీ లైబ్రరీలలో పెడుతుంటారు. పిల్లలు లైబ్రరీకి వెళ్ళినప్పుడు కొందరు ఆధ్యాత్మిక గ్రంథాలు తీసుకుంటారు, మరికొందరు పిచ్చిపిచ్చి నవలలు తీసుకుని వాటిని తమ పాఠ్య పుస్తకాలు, ఆధ్యాత్మిక గ్రంథాల మధ్యలో పెట్టుకొని చదువుతుంటారు. చూసేవారికి వాళ్ళు ఆధ్యాత్మిక గ్రంథాలు చదువుతున్నట్లుగా కనిస్తారు. కాని, వాళ్ళు చదివేవన్నీ పిచ్చి కథలు. అది మంచిది కాదు. మా కాలేజి లైబ్రరీలో అటువంటి పిచ్చి పుస్తకాలు పెట్టనే పెట్టము. ఎవరైనా తెచ్చిపెట్టినా మా పిల్లలు వాటిని ముట్టరు. వాళ్ళ హృదయాలు అంత పరిశుద్ధమైనవి.

srisathyasai vachanamrutam

అటువంటి పవిత్రమైన హృదయం కలిగి ఉంటే మీరు తప్పక పవిత్రమైన స్థానాన్ని చేరుకుంటారు; మీ మనస్సుకు శాంతి కలుగుతుంది. పిల్లలందరూ చాలా మంచివారే! కాని, వయస్సుయొక్క ప్రభావంచేత అప్పుడప్పుడు కొన్ని 'పాసింగ్ క్లౌడ్స్' మాదిరి పిచ్చిపిచ్చి ఆలోచనలు వస్తుంటాయి. అలాంటివి వచ్చినప్పటికీ వాటిని మీలో చేర్చుకోకుండా తక్షణమే తరిమిగొట్టాలి. ఆవిధంగా ఉంటూ మీరుకూడా కొన్ని మంచి గ్రంథాలు రాయండి. నిన్నటి దినము ఒక అబ్బాయి స్వామిదగ్గరకు వచ్చాడు.

*(శ్రీ సత్యసాయి యూనివర్సిటీలో విద్యాభ్యాసం పూర్తి చేసికొని, ప్రస్తుతం ఫిజిక్స్ డిపార్టుమెంటులో అధ్యాపకుడుగా పనిచేస్తున్న శ్రీ గౌరీ శంకర్‌ను వేదిక మీదికి పిలిచారు. అతనిని హంగరీలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూక్లియర్ సైన్సువారు తాము నిర్వహిస్తున్న ఒక అంతర్జాతీయ సదస్సులో పాల్గొనవలసిందిగా ఆహ్వానించారు. ఆవిషయాన్నిగూర్చి ప్రస్తావిస్తూ భగవాన్ ఇలా అన్నారు).*

ఇతను మంచి పిల్లవాడు, గుణవంతుడు, మంచి విద్యావంతుడు, ఫిజిక్స్‌లో చాలా మంచిగా రాశాడు. కనుకనే ఇతనిని హంగరీకి పిలిచారు. వాళ్ళు అందరినీ పిలవరు. అక్కడున్న కమిటీవాళ్ళు ఇలాంటి ప్రతిభావంతులు ఎవరైనా చిక్కితే వాళ్ళని మాత్రమే పిలుస్తారు. అన్ని ఖర్చులూ వాళ్ళే పెట్టుకొని ఎంతో గౌరవంగా ఇతనిని పిలిచారు. ('మంచిపేరు తెచ్చుకో' అంటూ శ్రీ గౌరీ శంకర్‌ని ఆశీర్వదించారు). ఈవిధంగా ప్రతి యూనివర్సిటీవాళ్ళు మిమ్మల్ని పిలిచి గౌరవించాలి. అదే నాకు ఆనందము; మీ తల్లిదండ్రులకుకూడా ఆనందము. అట్టి పిల్లలుగా మీరు తయారుకావాలి. మీరందరూ ఇతర యూనివర్సిటీలకు పోయి ఇక్కడ మీరు చదివినటువంటి, నేర్చుకున్నటువంటి విషయాలను పదిమందికి బోధించాలి. చూడండి, ఈనాడు శివరాజ్ పాటిల్ తాను అనుభవించి ఆనందించినటువంటివన్నీ ఒక గ్రంథంగా రాయడంచేత అది అందరికీ ఉపయోగపడుతున్నది. అట్లనే, మీరుకూడను ప్రతి యూనివర్సిటీకి పోయి మన కాలేజి విషయము, ఇక్కడి క్రమశిక్షణ, సదభ్యాసములు ఇవన్నీ వారికి చక్కగా వివరించి చెప్పాలి.

మన అనంతపురం కాలేజినుంచికూడను ఫిజిక్స్‌లోను, ఇంగ్లీషులోను మంచి మార్కులు

sri sathyasai vachanamrutam

తెచ్చుకున్న ఇద్దరు ఆడపిల్లలను అమెరికావాళ్ళు ఆహ్వానించారు. వాళ్ళు అడిగిన ప్రశ్నలకు ఈ పిల్లలు చక్కని సమాధానాలిచ్చారు. "మీకు పెండ్లి అయి ఉంటే మీ భర్తతో కలసి రండి. లేకపోతే, మీ జతకు ఎవరైనా ఆడవారిని తెచ్చుకోండి. వాళ్లకుకూడా ఛార్జీలు మేమే పెట్టుకుంటాము", అని చెప్పారు. ఈవిధంగా మా పిల్లలను ప్రశంసిస్తూ చాలా జాబులు వస్తున్నాయి. ఇట్లాంటి మంచి పేరు మీరందరూ తెచ్చుకోవాలి. అదే స్వామికి సంతోషం.

**– తేదీ 18.7.2008, గురుపూర్ణిమ,**
**సాయికుల్వంత్ సభామండపం**

sri sathyasai vachanamrutam